**ఎంతో అన్యోన్యంగా ఉండే సుబ్బారావు, సుందరి ఉండే వాటాలోంచి కేకలు చప్పుళ్ళు వినిపించే సరికి పాపారావుకు మతి పోయింది.**

కలగాని కనడం లేదు కదా అని గిల్లి చూసుకున్నా డతను. ఊహుం!! కలకాదు నిజమే.

"ఏమిటండీ.... ఏమిటి మీరనేది? మా పుట్టింటి వాళ్ళు ఎన్ని ఇచ్చినా తృప్తి లేదు. పైగా అది ఇది కావాలి అని అడుగుతారు. మనిషికి సిగ్గుండాలి" అంది సుందరి.

"నోర్ముయ్... పెద్ద పుట్టింటి వాళ్ళను వెనకేసు కొస్తున్నావు. పూచిక పుల్లలిచ్చి ప్లేను కొనిచ్చినట్లు చెప్పుకుంటారు" కస్సుమన్నాడు సుబ్బారావు.

"మీ వాళ్ళకంటే నయమే కదా. ఆ పుల్లలకి కూడా గతిలేదు."

"ఏమన్నావు!!..." చెంప ఛెళ్ళుమన్న శబ్దం.

పాపారావు ఒకసారి చెంప తడిమి చూసుకున్నాడు. అతనికి చాలా సంతోషంగా ఉంది. ఎందుకంటే సుందరి, సుబ్బారావు చిలకా, గోరింకల్లా ఉంటే చూసి సహించలేని ఆ వీధి వాళ్ళలో అతనూ ఒకడు. పాపారావుకి పెళ్ళి అయింది. అందమైన పెళ్ళాం ఉంది. అతని పరిస్థితి అన్ని విధాలా బాగుంది. అయినా ఎంత సేపూ ఒకళ్ళని చూసి ఈర్ష్యపడే రకం. అతనికి ఆ విషయంలో అతని భార్య నిజంగా సహ ధర్మచారిణి!!

పాపారావు భార్య క్వొశ్చన్ మార్కులా మొహం పెట్టి "ఏమిటీ?" అన్నట్లు చూసింది.

"ఏమో" అన్నట్లు భుజా లెగరేసాడు పాపారావు.

పక్క వాటాలో రాను రాను గొడవ పెరిగి పోతోంది. సుందరి ఏడుపు తారాస్థాయిని చేరుకుంది. ఆ ఇంట్లో ఉండే మిగతా ఏడు వాటాల వాళ్ళకు ఖర్చులేని వినోదంలా ఉంది ఆ గొడవ. ఆ భార్యా భర్తల కీచులాట చిలికి చిలికి గాలి వాన అయింది. కొంత సేపటికి సుందరి పెట్టితో బయటకు వచ్చి "నేను మా పుట్టింటికి పోతాను. నేను అక్కర్లేదన్నారుగా... ఎవరిని కావాలనుకుంటున్నారో వాళ్ళనే కట్టుకు ఊరేగండి" అంటూ ముక్కు గట్టిగా చీదేసరికి ఆఖరి వాటాలో అవతారం గారి చంటి పిల్లాడు ఉలిక్కిపడి ఏడుపు లంకించు కున్నాడు.

"అయ్యో! పాపం ఆ పిల్లని అలా బాధ పెట్టడం అన్యాయం" ఒక ముసలావిడ జాలి.

"అయినా మగాడికి బుద్ధి లేదనుకుందాం. ఆడది సర్దుకు పోనక్కర్లా" ఒక నడి వయస్కుని మందలింపు.

"ఏమోనమ్మా ఏదో సరదాగా ఉన్నారనుకున్నాం గానీ ఇలా వీధిన పడతారనుకో లేదు" ఒక అమ్మలక్క రాగం తీసింది.

"ఇప్పుడు బుద్ధొచ్చింది. 'లేకపోతే పెళ్ళాం తన కొక్కడికే ఉందను కున్నాడు" ఒక బ్రహ్మచారి అక్కసు. ఇలా రకరకాల వ్యాఖ్యానాలు సాగాయి.





ఇంటాయన పరంధామయ్య, ఆయన భార్య పరుగున వచ్చి ఏదో నచ్చ జెప్పబోయారు. సుందరి, సుబ్బారావులు ససేమిరా వినలేదు. పైపెచ్చు ఇద్దరికీ పట్టుదలలు పెరిగి పోయాయి. సుందరి విసురుగా బయటికి నడిచింది.



రెండు రోజులు గడిచాయి. ఆ ఇంటిలోని ఏడు వాటాల వాళ్ళేకాక, ఆ వీధి వాళ్ళంతా జరిగిన విషయం గూర్చి తర్జన భర్జన జరిపారు. సుందరిని కొందరు సపోర్టు చేస్తే, సుబ్బారావు రైటని కొందరన్నారు. జరిగిన దానికి బాధపడే వాళ్ళు కొందరైతే, సంతోషించే వాళ్ళు కొందరయ్యారు.

మూడవ రోజున సాయంకాలానికి సుందరి, ఆమె తండ్రి రామారావు వచ్చారు.

"ఏమిటయ్యా సుబ్బారావు నువ్వూ అమ్మాయి ఏదో గొడవ పడ్డారుట. కబురు కాకరకాయ లేకుండా ఇది ఊడిపడేసరికి హడలి చచ్చామనుకో. ఇంతకీ ఏమయ్యింది!?" అని ఆదుర్దాగా అడిగాడు రామారావు.

"ఏం! మీ అమ్మాయి చెప్పలేదా!? లేదా నా నోటి నుంచే చెప్పించాలనా!?" అన్నాడు సుబ్బారావు తీవ్రంగా.

"అదేం చెప్పలేదు బాబు. తప్పంతా మా అమ్మాయిదే అని తెలుసు. అందుకే పరిగెత్తుకొచ్చాను."

"ఏం మీ అమ్మాయిని కనుక్కునే ధైర్యం లేదేమిటి?"

"అదికాదు...."

"ఇంటిలో ఈ విషయాలన్నీ ఎందుకుగానీ రండి అలా ఏదైనా హోటల్‌కి వెళ్ళి మాట్లాడు కుందాము."

"అలాగే, రామ్మా" అంటూ అమ్మాయి చెయ్యి పుచ్చుకుని బయటికి నడిచారు. ముగ్గురూ హోటల్ కెళ్ళి భోజనం చేసారు.

"సుబ్బారావు....." అంటూ ఆగి పోయాడు రామారావు.

అంతవరకూ సీరియస్‌గా ఉన్న సుబ్బారావు ఒక్కసారిగా నవ్వుతూ "చెప్పేయనా సుందరి?" అని అడిగాడు.

"ఊఁ" అంది సుందరి తాను కూడా నవ్వుతూ. రామారావుకు మతి పోయింది.

"ఏమీలేదు మామగారూ. మా ఇద్దరి మధ్య ఎటువంటి గొడవలు లేవు. మేము హాయిగా ఉన్నాం.... ఈ మధ్య మమ్మల్ని చూసి ఏడిచేవాళ్ళు ఎక్కువయి పోయారు. మేము గొడవలు పడుతూంటే వాళ్ళ కడుపు మంట కాస్త తగ్గుతుంది కదా, మా మీద దృష్టి కేంద్రీకరించడం మానేస్తారు అని ఈఐడియా వేసాం. ఇద్దరం గొడవ పడినట్టు నటించాం. ఈసారి నెల రోజుల్లో గొడవ పడతాం. అప్పుడు అత్తగారిని పంపండి. ప్రతీసారి మీరు రావాలంటే కష్టం కదా" అన్నాడు సుబ్బారావు నవ్వుతూ.

"అబ్బ! మీ గొడవల్లోని అంతర్యం ఇదన్న మాట. భలే కంగారు పెట్టేసారు" అన్నాడు రామారావు గుండెల మీద చెయ్యి వేసుకుంటూ.

"ఈ రహస్యం మా ఇతర వాటాల వాళ్ళకి తెలియ కూడదు. ఇప్పుడే కాదు ఎప్పటికీ" అంటూ బిల్లు అందుకున్నాడు సుబ్బారావు.